క్లుప్తంగా

వైభవంగా చెన్నకేశవస్వామి బోనాలు


పొదిలి రూరల్: చెన్నకేశవ ఆలయం వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పొదిలి రూరల్: పొదిలి మండలం రామాపురం హరిజనవాడలో చెన్నకేశవ స్వామి బోనాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఒక్కరు ఉపవాసాలతో మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా పోతురాజుకు బండి కట్టి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం చెన్నకేశవ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు చెల్లించి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారి పేట, పాపాయి పల్లె గ్రామాల్లో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మ తల్లికి పూజలు


మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలో పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయసిబ్బంది శ్రీధర్‌రెడ్డితదితరులుపర్యవేక్షించారు.

పోలేరమ్మ తల్లికి పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ బండ్లు కట్టి ఉత్సవంగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా అమ్మవారి కళశాన్ని గ్రామంలో ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి తదితరులు సకాలంలో వర్షాలు పడి, గ్రామం పాడిపంటలతో పచ్చగా ఉండాలని పూజలు నిర్వహించారు.


ఆలయం వద్ద భక్తుల సందడి

స్కూల్.. వర్క్ ఫుల్..!


హైస్కూల్లో జరుగుతున్న గ్రానైట్ పనులు


హైస్కూలు మరుగుదొడ్లు

- త్రోవగుంట జెడ్పీ హైస్కూల్లో శరవేగంగా రెండో దశ నాడు–నేడు పనులు

ఒంగోలు రూరల్: ఒంగోలు నగరంలోని త్రోవగుంట జిల్లా పరిషత్ హైస్కూల్లో నాడు–నేడు రెండో దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, హెచ్‌ఎం చల్లా బ్రహ్మయ్య, ఏఈ సందీప్, ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎం సుధ పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారు. పాఠశాల తరగతి గదుల్లో గ్రానైట్ ఫ్లోరింగ్, మెట్లకు రెయిలింగ్, అధునాతన బెంచ్‌ల నిర్మాణం, డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేస్తున్నారు. అదే ప్రాంగణంలో టీచింగ్ స్టాఫ్‌కు మహిళలు, పురుషులకు వేరువేరుగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. హైస్కూల్లోనే ఎలిమెంటరీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు విడివిడిగా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయింది. ఎలిమెంటరీ పాఠశాలకు కూడా పాక్షికంగా మరమ్మతులు చేశారు. దాంతోపాటు ప్రతి తరగతి గదికి మెట్ల నిర్మాణం, రెయిలింగ్ నిర్మాణం పూర్తి చేసి అందమైన ప్రోటాన్స్, ఇరవై వేల వ్యయంతో కొబ్బరి మొక్కలు నాటారు. అధికారుల ఆదేశాల మేరకు నాణ్యత, మన్నికలో రాజీలేకుండా కార్పొరేట్ స్థాయిని తలదన్నే రీతిలో బెంచ్‌లు, బోర్డుల నిర్మాణం పూర్తిచేస్తున్నట్లు ఏఈ, హెచ్‌ఎం తెలిపారు. ఆట స్థలాన్ని ఆధునీకీకరించి జోనల్, మండల స్థాయి పోటీలు నిర్వహించేందుకు అణువైన కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రానైట్ పనులు పూర్తికాగానే విద్యుద్దీకరణ పనులు, ఫ్యాన్ల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. సుందరంగా హైస్కూలు, ఎలిమెంటరీ పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రానికి రంగులు వేయనున్నట్లు ఏఈ, హెచ్‌ఎం, ఎలిమెంటరీ స్కూలు హెచ్‌ఎం తెలిపారు.


అంగన్‌వాడీ కేంద్రం మరుగుదొడ్లు


మెట్ల వద్ద రెయిలింగ్ పనులు

కాపు నాయకులను ఇబ్బంది పెట్టింది జనార్దనే..

- దొంగ ఓట్లపై ప్రశ్నించినందుకు టీడీపీ హయాంలో సింగరాజు వెంకట్రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు
- కమ్మపాలెం ఘటనపై ఎస్పీ స్థాయి అధికారిని రంగంలోకి దింపి మా కుటుంబాన్ని హింసించారు
- నేడు కాపులకు ఏం చేశారని ప్రశ్నించే టీడీపీ నాయకులు.. నాడు ఏం చేశారో చెప్పాలి
- ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనావెంకట్రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సింగరాజు మీనావెంకట్రావు

ఒంగోలు: కాపుల అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అయితే.. వారిని ఇబ్బంది పెట్టింది మాత్రం టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అని ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగరాజు మీనా వెంకట్రావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాపులకు బాలినేని ఏం చేశారంటూ టీడీపీ నాయకులు ప్రశ్నించడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ హయాంలో కమ్మపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభించేందుకు వెళ్లిన బాలినేని, సింగరాజు వెంకట్రావులపై తప్పుడు కేసులు పెట్టించడమే కాకుండా చివరకు ఎస్పీ స్థాయి అధికారిని రంగంలోకి దింపి తమ కుటుంబాన్ని మానసికంగా క్షోభకు గురిచేశారని తెలిపారు. నేడు టీడీపీలో ఉండి ప్రశ్నిస్తున్న కాపు నాయకులకు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. సాక్షాత్తూ తహసీల్దారు కార్యాలయం వద్ద దొంగ ఓట్లు చేరుస్తుంటే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సింగరాజు వెంకట్రావుపై ఏకంగా ఎస్సీ, ఎస్టీ కేసు పెడితే నాడు ఎందుకు ప్రశ్నించలేకపోయారన్నారు. వెంకట్రావుకు నగర అధ్యక్షునిగా పదవి ఇవ్వడమే కాకుండా ఉన్నతమైన గుర్తింపు తెచ్చుకునేందుకు అవకాశం కల్పించడం, తనను క్యాబినెట్ ర్యాంకుతో సమానంగా ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమించడం కాపులకు జరిగిన సంక్షేమం కాదా అని ప్రశ్నించారు. ప్రజలంతా సంతోషంగా ఉంటే యుద్ధం చేయాల్సిన అవసరం ఉండదన్నారు. అభద్రతాభావం, అశాంతితో రగులుతున్న వారే నిత్యం యుద్ధం కోరుకుంటారన్నారు. కాపుల సంక్షేమానికి, అభివృద్ధికి వాసన్న ఏం చేశారో అందరికీ తెలుసని, వాసన్న గురించి మాట్లాడేటప్పుడు గౌరవప్రదంగా మాట్లాడాలని టీడీపీ నాయకులకు మీనాకుమారి హితవు పలికారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు మాట్లాడుతూ బాలినేని ప్రణీత్‌రెడ్డి టీడీపీ నాయకులను పార్టీ మారాలని ఒత్తిడి చేస్తున్నారని మాట్లాడటం గురివిందగింజ సామెతను గుర్తుచేస్తుందన్నారు. గత ఎన్నికల సమయంలో సాక్షాత్తూ టీడీపీ నాయకులు కమ్మ వెంకటేశ్వర్లును తన వద్దకు పంపి పార్టీ మారితే రూ.20 లక్షలు ఆఫర్ చేసిన విషయం మరచారా అంటూ ప్రశ్నించారు. తాను పార్టీ మారడం జరగదని, అంతకంటే మరణించడం బెటరని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. వాసన్నకే కక్షసాధింపు రాజకీయాలు ఉంటే కపిల్ బాషాకు పెండింగ్‌లో ఉన్న టెంట్ బిల్లులు కూడా నిలిపేవని, కానీ వాసన్నకు అటువంటివి చేయడం తెలియదని అన్నారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సహకార బ్యాంకులు వైఫల్యం చెందిన ప్రభావం ఒంగోలు అర్బన్ బ్యాంకుపై కూడా పడిందన్నారు. తాను చైర్మన్‌గా ఉన్న సమయంలోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. దీంతో ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఏ ఒక్క ఖాతాదారు నష్టపోకూడదనే ఉద్దేశంతో మరో బ్యాంకులో విలీనం చేయడం జరిగిందన్నారు. దీనివల్ల ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా పోవడంతోపాటు ఉద్యోగులు కూడా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం విలీనం చేస్తే దానిని కూడా రాజకీయం చేయాలనుకోవడం సరికాదన్నారు. టీడీపీ నగరంలో చేసిన అభివృద్ధికి కరపత్రం సరిపోతుందని, తాము చేసిన అభివృద్ధికి పుస్తకాలు కావాలని అన్నారు. త్వరలోనే వాటిని కూడా అందిస్తామని స్పష్టం చేశారు. ముస్లిం ఖబరస్తాన్ కమిటీ కార్యదర్శి, మక్కా మసీదు కమిటీ ఉపాధ్యక్షుడు జిలాని మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జనార్దన్ ముస్లింల సంక్షేమానికి ఎంతో చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఖబరస్థాన్‌కు ఇప్పటివరకు రూ.90 లక్షలు ఖర్చుచేస్తే.. అందులో దామచర్ల ఎమ్మెల్యేగా అందించిన నిధులు రూ.20 లక్షలు మాత్రమేనన్నారు. షాదీఖానాకు బాలినేని సహకారంతో కోటి రూపాయల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఉన్నత చదువులు చదివానని, లాయర్‌ననే వ్యక్తి ఎదుటి వ్యక్తికి ఎలా గౌరవం ఇవ్వాలో కూడా తెలుసుకోవాలన్నారు. 2 ఎకరాల స్థలాన్ని ఖబరస్తాన్ కోసం బాలినేని కేటాయింపజేస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న టీడీపీ నాయకులను ముస్లిం నాయకులు ప్రశ్నించాలన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో శిద్దా సుధీర్ దంపతుల పూజలు


హరిహరక్షేత్రంలో కేక్ కట్‌చేస్తున్న టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు

చీమకుర్తి: టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు ఆదివారం చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో పూజలు చేశారు. టీటీడీ బోర్డు మెంబర్‌గా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా చీమకుర్తిలోని హరిహరక్షేత్రాన్ని దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామివారికి పూజలు చేసి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం అభిమానుల మధ్య ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేశారు. పలువురు అభిమానులు గజమాలలతో వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శిద్దా సుధీర్ కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, గ్రానైట్ క్వారీల మేనేజర్లు, ఫ్యాక్టరీల యజమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పూజలు


జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకి స్వాగతం పలుకుతున్న నాయకులు

ముండ్లమూరు: మండలంలోని కొమ్మవరంలో ఆదివారం జరిగిన పోలేరమ్మతల్లి కొలుపులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. గ్రామస్తులు సకాలంలో వర్షాలు పడి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ కొలుపుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోలేరమ్మతల్లి, అంకమ్మతల్లి, సీలంపాటి అమ్మవారు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీ బంకా రమణమ్మ నాగిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, బొప్పూడివారిపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు గాదె నాసరరెడ్డి, పసుపుగల్లు ఉప సర్పంచ్ బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి, నాయకులు మందలపు అశోక్, మేకల కృష్ణారెడ్డి, ఏరువ నాగిరెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదుతో రైతులకు మేలు


వేంపాడులో పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ముండ్లమూరు: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఇ– క్రాప్‌లో నమోదు చేసుకోవడం వలన అనేక ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. శ్రీనివాసరావు అన్నారు. ముండ్లమూరు, వేంపాడులో ఆయన ఆదివారం క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు, పంట నమోదులో చేసిన వివరాలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర కార్యాలయం సూచనల మేరకు వారు కేటాయించిన పొలాలను పరిశీలించి, ఆన్‌లైన్ చేసిన వివరాలతో సరిపోతున్నాయా.. లేదా అని ఆరా తీశారు. రైతులు ఇ– కెవైసీ కూడా చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన రైతులకు నష్టం వాటిల్లితే ప్రభుత్వ రాయితీలు పొందుతారన్నారు.ఆయన వెంటఏఓఫరూక్ ఉన్నారు.

విశ్వకర్మ కౌసల్ యోజనపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వకర్మవిశ్వబ్రాహ్మణులు

గిద్దలూరు రూరల్: ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన విశ్వకర్మ కౌసల్ యోజన్ పథకంపై విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు రంగాచారి మాట్లాడుతు భారత ప్రధాన మంత్రి మోదీ సంప్రదాయ చేతి వృత్తుల వారి అభివృద్ధి కోసం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. వసంతాచారి, నల్లగట్ల వీరబ్రహ్మాచారి, వీరభద్రాదిచారి, చంద్రశేఖర్‌ఆచారి పాల్గొన్నారు.

భారీ వర్షం.. రైతులు హర్షం

యర్రగొండపాలెం: గత రెండు నెలల నుంచి వర్షాలు కురవక ప్రజలు అల్లాడుతున్న తరుణంలో శనివారం అర్ధ రాత్రి నుంచి యర్రగొండపాలెం ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల వలన పంటలకు ఎంతగానో మేలు చేకూరిందని వ్యవసాయాధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం తెరిపివ్వడంతో రైతులు తమ పొలాల్లో మిరప పంటను నాటు కోవడం మొదలు పెట్టారు. సాయంత్రం ఉధృతంగా వర్షం కురువడం మొదలు పెట్టింది. నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కాలువలు, చెరువులు, కుంటలకు నీరు చేరుతోంది. రాళ్లవాగు ఉధృతంగా పారుతోందని పాలుట్ల ప్రాంతానికి చెందిన రైతులు తెలిపారు. ఉద్యానపంటలకు ప్రాణం పోసినట్లయిందని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి తెలిపారు. ఈ వర్షాల వలన భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.


రాచర్ల: అనుమలవీడులో ప్రవహిస్తున్న నక్కలవాగు


యర్రగొండపాలెం చెరువుకు పారుతున్న నీరు

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లె, పాకలవీడు, అనుమలవీడు, రాచర్ల, గుడిమెట్ట, గౌతవరం గ్రామాల్లో శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అనుమలవీడు, పాలకవీడు, గుడిమెట్ట, ఒబుల్‌రెడ్డిపల్లె గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో వర్షపు నీటితో నిండిపోయాయి. భారీ వర్షం కారణంగా వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వర్షం కురవడంతో పత్తి, మిరప, పొగాకు, కంది, కూరగాయల పంటపొలాలకు ప్రాణం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొగాకు, మిరప నాట్లు వేసుకుంటున్నారు.


మార్కాపురం వద్ద పత్తి చేలో నిలిచిన వర్షం నీరు

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి 63 మి.మీ వర్షం కురిసి నట్లుగా అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో ఇంత మాత్రం వర్షం కురవకపోవడంతో ఈ వర్షంతో భూములు సాగుచేయడానికి పదునయ్యాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్రిపురాంతకం: భారీ వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఒక్కరోజే భారీగా కురిసిన వర్షంతో వాతావరణంలో మార్పు కనిపించింది. మండలంలోని కందుర్లవాగు, కండ్లేరు, దువ్వలేరు, అడ్డ వాగులలో నీటి ప్రవాహం కొనసాగింది.

శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయ ప్రాంగణంలోకి వర్షం నీరు చేరింది. త్రిపురాంతకం ఆలయం వద్ద కురిసిన భారీ వర్షం కారణంగా అమ్మవారి ఆలయ ప్రాంగణం నీటితో నిండింది.

మార్కాపురం/కొనకనమిట్ల: మార్కాపురం ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు జీవం పోసుకున్నాయి. రబీ పంటల సాగుకు భూములు కూడా పదునెక్కాయి. గత రెండు రోజులుగా మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు, యర్రగొండపాలెం, పొదిలి, కొనకనమిట్ల తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. నెల రోజుల క్రితం నాటిన పత్తి, మిర్చి, కూరగాయల పంటలకు ఈ వర్షం ఉపయోగకరమని మార్కాపురం వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. రైతులు మిర్చి నారు పోసుకోవచ్చని, కంది, పత్తి కూడా సాగు చేసుకోవచ్చని ఏఓ సూచించారు. మార్కాపురం మండలంలో ఇప్పటి వరకు 5002 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా పత్తి 3264 హెక్టార్లలో, కంది 696 హెక్టార్లలో, మిర్చి 733 హెక్టార్లలో సాగయ్యాయి. ఇంకా సజ్జ, జొన్న తదితర పంటలు కూడా రైతులు సాగు చేశారు. పది రోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఇబ్బంది పడిన జనం ఈ వర్షంతో ఉపశమనం పొందారు.


త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయ ప్రాంగణంలోకి చేరిన వర్షం నీరు


గొట్లగట్టులో కురుస్తున్న వర్షం

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

గిద్దలూరు రూరల్: ఆటో ఢీ కొని ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన మండలంలోని శింగంపల్లె గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. సూరేపల్లె గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి తన బైక్‌పై లింగాపురం గ్రామానికి చెందిన వీరారెడ్డి అనే వ్యక్తిని ఎక్కించుకుని ఉయ్యాలవాడ గ్రామం వైపు వెళుతున్నాడు. ఆ సమయంలో వెనుకాల నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ బైక్‌పై నుంచి కింద పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకుని క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.